# ౭ తిమ్మ జగపతిరాజ! ధీరగుణ భోజ!

ఇది వ్రాయడంలో పాఠకునకు వెంటనే చెప్పేస్తున్నా, స్థలం, స్థలపరిసర ప్రాంతం; తిన్నగా వెళ్ళి ఎంతసేపు కావాలంటే అంతసేపూ ఆసీనుడై యాకలించవచ్చు. పాఠకుడు ప్రయాస పడనక్కఱ లేదు. ప్రయత్నించ నక్కఱ లేదు. ఆగు! పాఠకా! ఆగు! వెల్లడి సేయుటంత సులభము గాదు. ఆగు! పాఠకా! ఆగు!

నాయకుడు తేట తెల్లమ, గిలకల పద్యం చదివిన రోజులనుండి, "పరగ పద్దెనిమిది పరగణాలేలు తిమ్మ జగపతిరాజ! ధీరగుణభోజ!" అని. కాని స్థల మగమ్యం. ఆ పద్యం చదువుతూ బగ్గుండా పువ్వులూ గిలకలతో కొడుతూ వుంటే ఎదుట పప్పు బెల్లాల మీద దృష్టితప్ప మఱొకటుండేదే కాదు. ఆ గిలకలు పుచ్చుకొని కొండవాగులు, చెరువులు దాటేవాళ్ళం—పొరుగూళ్ళను వుండే బందుగులిళ్ళకు పంతుళ్ళ తీసికొని వెడుతూవుంటే—ఆ వూళ్ళల్లో వొకటన్నా పద్దెనిమిది పరగణాలకు సంబంధించిన వూరుండా అంటే ఒక్కటీ లేదు. ఒక్క మనిషీ తిమ్మ జగపతిరాజు పేరు గలాడు లేడు. అయినప్పటికీ "పరగ పద్దెనిమిది పరగణాలేలు తిమ్మ జగపతిరాజ! ధీరగుణభోజ!" అని చదివి "జయాభి జయ భవ దిగ్విజయ భవ"తో ముగించి పువ్వులూ బగ్గుండా చల్లేసెయ్యడమే.

ఆ సందర్భం ఎప్పటికేలాగు బోధపడిందో 'అదే యీ గద్య ప్రసంగము—రా! నాతోకూడారా! పాఠకా! రా!'

*　　*　　*

ఓ రోజున నాకు ముప్పైయ్యో పది వచ్చినాక ఓ మార్గంగా ఓ పల్లెటూరు వెళ్ళవలసి వచ్చింది. అదివఱకూ వెళ్ళేవాణ్ణి ఆ యూరు తరచుగా. కాని అప్పుడు వెళ్ళింది వెల్లడి మార్గం. ఇప్పుడు వెళ్ళింది రెండో కంటికి తెలియకుండా వెళ్ళిన మాఱు మూల తెన్ను. ఆ దారి బట్టింది కొంత విశ్రాంతి కోసం కొంత వింత కోసం.

ఋతువు గ్రీష్మ ఋతువు. గ్రీష్మ ఋతువు అయినా అకాల వర్షాలు మూడు నాలుగు పడి భూమంతా పచ్చ రాళ్ళతో గగుర్పొడిచినట్టు పచ్చిక మొలిచి వుంది. ఆ పచ్చిక చూడగా నాకో అచ్చెఱువు గలిగింది. "ఆకాశాన్నుంచి వాన చినుకులు విడివిడిగా వేన వేలు పడడ మెందుకు? ఏనుగు తొండంతో లాగు ఏక ధారగా పడకూడదా?" అని. అయితే వెంటనే తట్టింది. "భూమి మీద ఆవలించుకొని ఆశ కొద్దీ భూమి పగుళ్ళల్లో పేచియుండే పచ్చిక విత్తులు వేలకువేలు విడివిడిగా నున్నప్పుడు అన్నింటికీ అన్ని చినుకులూ కురిసి అన్నింటినీ తనియించి అన్నింటినీ ఫలోన్ముఖములుగా జేసి అన్నింటికీ ముక్తి గూరుద్దామనే వూహకొద్దీ అన్ని చిన్న చిన్న చినుకులు విడీ విడిగా పడుతూ వుంటాయి" అని ఆ వెంటనే తట్టింది. ఆహా! భువిపై నాసించుకొని యున్న ప్రతీవ్యక్తి బీజం విషయమై భగవంతుని కెంత దయ! ఎంత విచింతనం!——క్రొత్తగా గురిసిన ఆ వానలకు గాడ్పుల ధూళీ వాడూ పోయి మొక్కలు పసందుగా వున్నాయి. మార్గం గరువు మార్గం. గరువు అడ్డుపడి

వెళ్ళాలి. అలా వెడుతూ వుంటే గబుక్కున నాకోతట్టు మట్టిగోడలు మట్టి బురుజులు వాటిమీద మొలకలు మొఅడులు అన్నీ కనిపించాయి. వెంటనే అనుకున్నాను. "ఇక్కడో స్థలం పాడు వడింది, కనీళ్ళు గార్చ దగింది వుందిగదా!" అని. నా హృదయం అలాగే ఆ పాడువడిన కోట యొక్క సంస్మృతి భారంతో కాళ్ళీడ్చుకుంటూ కొంత సేపటికి అనగా రాత్రికి నే వెళ్ళవలసిన గ్రామం చేరుకుంది. ఆ గ్రామంలో చూడా లనుకొన్న చుట్టాలింటికి వెళ్ళి, ఇచ్చిన నీళ్ళతో కాళ్ళు కడుక్కొని, వేసిన పీటమీద కూర్చుని, అడిగిన ప్రశ్నలకు కుశలం చెప్పేయింతలో చీకటి పడింది. సరే, పెద్దవాళ్ళంతా ఆడవాళ్ళు ఆ పనిమీద ఆ పనిమీద వుండి పోగా నేను కుఱ్ఱవాళ్ళతో చనువుగా మాటలాడుతూ అరుగు మీద ఆసీనుడ నైనాను. ఆ పిల్లకాయలలో ఒక చిన్నమ్మాయి, ఎనిమిది తొమ్మిదే ళ్ళుంటాయి, అది ఉత్తపెంకెపిల్ల. పెంకెపిల్లయినా నన్ను "అన్నయ్యా!" అని పిలవడం అలవాటుచేత నాకా పిల్ల పెంకెతనం పెంకెతనంగా తోచక ముద్దుగానే వుండేదెప్పుడూ.

"ఏదన్నా ఓ చిన్న పాట పాడమ్మా!" అన్నాను అంటే "గిలకల పద్యం పాడనా?" అంది. "పా" డన్నాను. అనేసరికి "పరగ పద్దెనిమిది పరగణాలేలు, తిమ్మ జగపతిరాజ! ధీరగుణ భోజ!" అని పాడింది. నాకు స్మృతి అపారమైపోయి "ఎవరమ్మా! తిమ్మ జగపతి రాజు! ఎవరమ్మా! ధీరగుణభోజుడు?" అని ఆప్యాయంగా అడిగాను. అడిగితే ఆ అమ్మాయి "నివ్వే! నివ్వే! జయాభి జయభవ! దిగ్విజయ భవ! పప్పు బెల్లాలెట్టు మటీ, పప్పు బెల్లాలెటు మటీ" అంది.

"నీవే; నీవే," అని చెల్లెలంటూంటే నా హృదయం ద్రవీభూతమై పోతూంది. జేబులో వున్న అటుకుల జీడిపప్పు పొట్లం తీసి ఆ పిల్ల

చేతి కిస్తూ "నాకు మఱి పద్దెనిమిది పరగణా లున్నాయా! రాజుకుండే కోటవుందా?" అని ప్రశ్నించాను. "లేకపోతే నేనిస్తాను నా పద్దెనిమిది పరికిణీలు, నేను పేకతో గట్టిన కోటా" అంది. నా కూరకే కళ్ళమ్మట నీళ్ళు కారిపోతున్నాయి.

"నా చిట్టితల్లీ!" అని ఒకమాటు దాన్ని దగ్గఱగా తీసుకొని, చిన్న పిల్లలు గిలకలు పట్టే సరదాలో కాలం భస్మీపటలం చేసినటువంటి చరిత్రాంశములు తట్టనిచ్చుకోరనుకొన్నాను. అంతలో నావాళ్ళో కూర్చుని వున్న పిల్ల చటుక్కున లోపలికి వెళ్ళి తిరిగి వచ్చి "అన్నయ్యా! నాన్నే నేను కోట కట్టిన పేకముక్కలన్నీ కోట పడగొట్టి మాయంచేసి ముక్కలన్నీ బొత్తు పెట్టుకొని పెట్లో పెట్టుకు తాళం వేసుకెక్కడికో వెళ్ళిపోయినాడు. నా పరికిణీలన్నీ యిమ్మంటే అమ్మేం "నీకెక్కడున్నాయి యింకా పరికిణీలు? అన్నీ చిరిగి పోయినాయి!" అంది. ఉంచే. దాచుంచే!" అంది.

"నాన్న పాడుచేస్తాడా? అమ్మ అబద్ధ మాడుతుందా? వట్టిమాట. వట్టిమాట!" అంటూ ఏదో పరధ్యాన రూపకమైన శాంతి యోచనములో నిమగ్నుడనై పోయినాను నేను! హృదయం దృఢిమ దాల్చింది. కనులు చిరునవ్వు నవ్వాయి.

"ఇక్కడో స్థలం పాడుపడింది, కన్నీళ్ళు కార్చదగింది వుంది" అని అనుకొన్న దెక్కడో?

| | | |
|---|---|---|
| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
| 30-8-1931 | కట్టమూరు | "గృహలక్ష్మి"లో |